క్లుప్తంగా

అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి



కేటీదొడ్డి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలు ప్రతి గ్రామంలోని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ అన్నారు. మండలంలోని నందిన్నె గ్రామంలోని బుధవారం యువతతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దళితుల అభివృద్ధి కోసం ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో హుస్సేన్, సూరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: మండల కేంద్రంలోని 33 కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ స్తంభాలు, వైర్లు పటిష్టపరిచేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నీలి గోవిందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండల కేంద్రం, బింగుదొడ్డి, ఎక్లాస్‌పురం, దేవబండ, జడదొడ్డి గ్రామాలకు సుమారు మూడు గంటల పాటు సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మల్దకల్: మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు తేజస్విని, త్రివేణి, కేశవర్ధన్, లోకేష్‌లు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు జీహెచ్ఎం నరేష్ తెలిపారు. ఈ నెల 29న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఆర్టీసీ బస్ ఢీకొని ఎద్దు మృతి



ఎర్రవల్లి: జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్ ఢీకొని ఎద్దు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు.. మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కత్తి రాజేష్ భార్య విద్యావతితో కలిసి ఎద్దుల బండిపై వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో కర్నూల్ నుంచి గద్వాల వైపు వెళ్తున్న సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్ ఎద్దుల బండిని ఢీకొట్టింది. ప్రమాదంలో బండిపై ఉన్న దంపతులకు స్వల్ప గాయాలు కాగా ఓ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.1లక్ష ఉంటుందని ప్రభుత్వం నుంచి ఆదుకోవాలని బాధితులు కోరారు.

విషవాయువులతో తీవ్ర ఇబ్బందులు

ఎర్రవల్లి: మండల పరిధిలోని జింకలపల్లి సమీపంలో నిత్యం విష వాయువులు వెదజల్లుతున్న ఓ కంపెనీపై చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాల ప్రజలు బుధవారం టీజీపీసీబీలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కంపెనీ నుంచి వెదజల్లుతున్న విష వాయువులతో భూగర్భ జలాలు, పర్యావరణం దెబ్బతింటుందన్నారు. నిత్యం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, వీరన్న, శేషు, వీరబాబు, గోవిందు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



ఉండవల్లి: మండల కేంద్రం ఉండవల్లిలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు, మంగళహారతి, అష్టోత్తరం తదితర క్రతువులు చేశారు. శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- కంకర రోడ్డుపై తరచూ ప్రమాదాలు
- రోడ్డు వేయాలని వాహనదారుల వినతి
- పట్టించుకోని పాలకులు, అధికారులు



కంకర తేలిన పుల్లూరు కలుగోట్ల రోడ్డు

ఉండవెల్లి: జాతీయ రహదారి నుంచి పుల్లూరు, కలుగోట్ల గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై రూ.3 కోట్లకు పైగా నిధులతో హైలెవల్ వంతెన, రహదారి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేశారు. దీంతో రెండేళ్లుగా వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. రోడ్డు పనులు పూర్తి చేసి ప్రమాదాల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

రెండేళ్లయినా పూర్తవని పనులు..

జాతీయ రహదారి నుంచి పుల్లూరు మీదుగా కలుగోట్ల, మెన్నిపాడు గ్రామాలకు రహదారిని 2022లో మాజీ ఎమ్మెల్యే అబ్రహం మంజూరు చేయించి భూమి పూజ కూడా చేశారు. కానీ కంకర వేసి పనులు నిలిపేశారు.. ప్రస్తుతం లోలెవల్ బ్రిడ్జి నిర్మాణం నుంచి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కూడా పూర్తి చేశారు. కానీ అటాచ్ రోడ్డు పనులు పూర్తి మాత్రం పూర్తి కాలేదు. కంకర వేసిన రోడ్డు కూడా గుంతలు గుంతలుగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన ప్రభుత్వమైన రోడ్డు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు మారినా...
పనులు మాత్రం పక్కదారే ..

గత పంచాయతీరాజ్ శాఖ అధికారి నిధులు మంజూరు చేసిన వాటికి కంకర వేసి కాంట్రాక్టర్ చేతులు దులుపేసుకున్నారు. ప్రస్తుతం అధికారులు బదిలీ కావడంతో ఆ రోడ్డు పరిస్థితి యధాతథంగా ఉంది. దీంతో రోడ్డు పనులు కాస్తా పక్కకు పెట్టేశారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి పనులు పూర్తి చేయాలి..

లోలెవల్ వంతెన పైనుంచి వరదనీరు పారుతుండడంతో అటువైపుగా ఉన్న నీరు అధిక మోతాదులో ప్రవహిస్తుంది. బ్రిడ్జి పనులు సాగుతున్నా రహదారి పనులు పూర్తి కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

-నాగరాజు,మెన్నిపాడు గ్రామం

సాంకేతిక కారణాలతో ఆలస్యం..

సాంకేతిక కారణాలతోనే జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమే. నిబంధనల ప్రకారం వంతెన నిర్మాణం చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్‌తోనే ఇరువైపులా రహదారి నిర్మాణం చేయిస్తాం. త్వరలోనే ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తాం.

-తిరుపతన్న, ఎంపీడీఓ, ఉండవెల్లి

వేతన సాధన కోసం పోరాటం



నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అలంపూర్: కనీస వేతన సాధన కోసం దశలవారీగా పోరాటం చేద్దామని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో ఉద్యోగులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేజీబీవీ, యూఆర్ఎస్, సర్వశిక్షా అభియాన్, ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ సాధన కోసం యూటీఎఫ్ దశల వారీగా ఉద్యమాలు చేస్తోందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాన్ని మంజూరు చేయాలనే ఏకైక డిమాండ్‌తో పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పాఠశాల స్థాయి నిరసనలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు, జిల్లా రిలే నిరాహార దీక్షలు, బడ్జెట్ సమావేశాల్లో చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మద్దిలేటి, యూటీఎఫ్ నాయకులు రాముడు, బయన్న, కేజీబీవీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై కళాబృందం అవగాహన



గట్టులో పోలీస్ కళా బృందం ప్రదర్శన

గట్టు: మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్ నేరాలపై బుధవారం గట్టు బస్టాండ్ ఆవరణలో పోలీస్ కళా బృందం అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీస్ కళా బృందం సభ్యులు డయల్ 100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్స్, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు, పోక్సో కేసులు, సీసీ కెమెరాల వలన ఉపయోగాలు తదితర అంశాలపై వివరించారు. ఏఎస్ఐ అయ్యన్న మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో పోలీసులు ప్రజలకు అండగా నిలుస్తారన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళా బృందం సభ్యులు రాధమ్మ, కృష్ణ, రామాంజనేయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూపర్ బ్రెయిన్ యోగాతో జ్ఞాపక శక్తి



జూనియర్ కళాశాలలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న జీవన్‌రావు

అలంపూర్ : సూపర్ బ్రెయిన్ యోగాతో జ్ఞాపకశక్తి, ఏకగ్రాత పెరుగుతుందని రాష్ట్ర అవార్డు గ్రహీత, గుంజీళ్ల మాస్టర్ అందె జీవన్‌రావు అన్నారు. అలంపూర్ పట్టణలోని జూనియర్ కళాశాలలో సూపర్ బ్రెయిన్ యోగా అంశంపై బుధవారం విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. యోగా వలన మెదడు చురుకుదనం పెరిగి జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని పరిశోధనల్లో తేలినట్లు పేర్కొన్నారు. క్రమ పద్ధతిలో సూపర్ బ్రెయిన్ యోగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పాటు అందిస్తోందన్నారు. అంతర్జాతీయ, రాష్ట్ర సదస్సుల్లో సూపర్ బ్రెయిన్ యోగ అంశంపై సమర్పించిన పరిశోధన పత్రాల ప్రతులను కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. విద్యార్థులు అడిగిన సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు సుధారాణి, రాముడు, రాజు, రామచంద్రయ్య, విద్యార్థులు ఉన్నారు.

పశు సంపదతో ఆర్థికంగా అభివృద్ధి



పశువైద్య శిబిరంలో సిబ్బంది

గట్టు: పశు సంపదతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, రైతులు పశు సంపదను పెంచుకోవాలని పశు వైద్యాధికారులు శంకరయ్య, వరలక్ష్మీ అన్నారు. బుధవారం లింగాపురంలో మహబూబ్ నగర్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధి, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు శంకరయ్య, వరలక్ష్మీ మాట్లాడుతూ.. గ్రామాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే పశు సంపదను కూడా అభివృద్ధి చేసుకోవాలన్నారు. పాడి పశువులకు సరైన పోషణ, పోషకాహారం అందించాలన్నారు. చూడి పశువులకు తప్పని సరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. శిబిరంలో 12 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గడ్డి విత్తనాలు రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రియాంక, వెటర్నరీ అసిస్టెంట్లు పృథ్వీరాజ్, కనకరాజు, అబ్దుల్‌ఖాజా, గోపాల మిత్రలు సూపర్‌వైజర్ సూర్యారెడ్డి, గోపాలమిత్రలు శివశంకర్‌గౌడ్, పరమేష్‌నాయుడు, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన ఉండాలి



కుచినెర్లలో ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

కేటీదొడ్డి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన పెంచుకోవాలని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తాన్య నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని కుచినెర్ల గ్రామంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని భగవద్గీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల గ్రంథాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. భగవద్గీతలోని శ్లోకాలు, భావాలు వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు భాస్కరాచారి, వీరేస్, విజయ్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన వంతెన నిర్మించాలి



అయిజ: మున్సిపాలిటీలో వాల్మీకి ఆలయం ఆవరణలో నూతన వంతెన నిర్మించాలని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏఈ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. పెద్దవాగు వంతెన నుంచి వాల్మీకి ఆలయం వైపు వెళ్లే రహదారిని పెంచేందుకు, ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు పాత వంతెనను మూసివేసి, నూతన వంతెన నిర్మించడంతో పాటు రోడ్డును వెడల్పు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణాచారి, నాగరాజు, భీమన్న, చిన్న ఆంజనేయులు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సవారమ్మ జాతర

మల్దకల్ : మండలంలోని దాసరపల్లి గ్రామంలో బుధవారం సవారమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పూజలు చేశారు. పాట్టేళ్లతో మొక్కులు చెల్లించారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'దీక్షా దివస్'ను విజయవంతం చేయాలి

గద్వాల అర్బన్: ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌తో పాటు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాలు వ్యతిరేకించాలి



గట్టు: ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు వ్యతిరేకించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్య రాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కిషోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. అమ్మాయిలకు 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేయకూడదన్నారు. రక్త హీనత దూరం చేసేందుకు మహిళలు సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కిషోర బాలికలు రక్త హీనత బారిన పడకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు వెంకట్రావమ్మ, సుజాతమ్మ, రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ మల్లమ్మ, ఏఎన్ఎం పార్వతి, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం



మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

శాంతినగర్ : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిరుపేద విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ పల్లయ్య ఆరోపించారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో బీఆర్ఎస్వీ నాయకులతో కలిసి బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. మాగనూర్ పాఠశాలలో తరచూ ఫుడ్ పాయిజన్ కావడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 48 మంది విద్యార్థులను సీఎం రేవంత్‌రెడ్డి పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. విద్యార్థుల మరణాలు సర్కార్ హత్యలే అన్నారు. ఇదేనా ప్రజాపాలన అని ఎద్దేవా చేశారు. హాస్టళ్లలో దుస్థితిపై కనీసం సమీక్ష పెట్టలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందంటే సిగ్గుచేటన్నారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థిని శైలజ మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. శైలజ మృతికి బాధ్యత ప్రభుత్వం వహించాలన్నారు. విద్యార్థి మృతి చెంది 24 గంటలు కాకముందే నారాయణపేట జిల్లా మాగనూరులో 30 మంది విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ కావడం సర్కార్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పాఠశాలలు, గురుకులాల్లో ఇప్పటికైనా మౌళిక వసతులు కల్పించి నాణ్యమైన భోజనం అందించాలని లేని పక్షంలో బీఆర్ఎస్వీ పోరాటానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్లు గద్దం భరత్‌బాబు, ఖాజావలి, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువత న్యాయవాది వృత్తిలోకి రావాలి



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్

అలంపూర్ : యువత సేవా భావంతో న్యాయవాది వృత్తిలోకి రావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులోని న్యాయవాదుల కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పుల్లూరు గ్రామానికి చెందిన రాకేష్‌ను న్యాయవాదిగా పరిచయం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తి గౌరవ ప్రదమైందన్నారు. నూతన న్యాయవాదులు కోర్టులో ఏ విధంగా ఉండాలి, న్యాయస్థానంలో ఏ విధంగా కక్షిదారుల తరపున వాదనలు వినిపించాలన్న అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరి, నారాయణ రెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు యాదవ్, మహానంది, వెంకట్రాముడు, ఆంజనేయులు, గజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ధరూరులో వ్యాసరచన పోటీలు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'పునరుత్పాదక శక్తి - వనరులు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వ్యాస రచన పోటీలను మండల ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించి పరిశీలించారు. ఎంపికైన విద్యార్థులకు గురువారం జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, వనజ, రాఘవేంద్ర, ఆంజనేయులు, ఎల్లస్వామి, శ్రీనివాసులు, సీఆర్‌పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు : ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం గట్టులోని ఎమ్మార్సీ భవనంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ నల్లారెడ్డి తెలిపారు. మొదటి బహుమతి రజిత (ఇందువాసి ఉన్నత పాఠశాల), ద్వితీయ బహుమతి రూపవతి (ఇందువాసి ఉన్నత పాఠశాల), తృతీయ బహుమతి స్పందన (గట్టు ఉన్నత పాఠశాల) నిలిచారు. విజేతలకు జిల్లా కేంద్రంలో శుక్రవారం బహుమతులు అందజేయనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

యువత అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహ

శాంతినగర్: బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనపై యువత అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ నరసింహ అన్నారు. వడ్డేపల్లి ఐకేపీ భవనంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ-యువజన సంఘాల పాత్ర అనే అంశంపై మండల స్థాయి యువజన సంఘాలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల కార్మికులు, బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయన్నారు. యువత వాటిపై దృష్టి సారించి ఉన్నతాధికారులకు సమాచారం అందజేయాలన్నారు. విషయం తెలిపి అరికట్టేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, ఏపీఎం మహేష్, తిరుమలేష్, వెంకటేష్, నరేంద్ర, మనోహర్ పాల్గొన్నారు.

నమోదులో తప్పులు లేకుండా చూడాలి



ఎల్కూరులో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న డీపీఓ శ్యాంసుందర్

మల్దకల్ : సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని డీపీఓ శ్యాంసుందర్ సూచించారు. బుధవారం మండలంలోని ఎల్కూరులో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మాన్‌దొడ్డిలో వసతులు పరిశీలిస్తున్న ఎంఈఓ భగీరథ రెడ్డి

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డి పాఠశాలను ఎంఈఓ భగీరథ రెడ్డి బుధవారం పరిశీలించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్, క్రైమ్ కంట్రోల్ బ్యూరో హుసేన్‌తో కలిసి పాఠశాలలో తనిఖీలు చేశారు. మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యత పాటించాలన్నారు. పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలపై స్థానిక యువకులు వారికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 153 మంది విద్యార్థులకు గానూ ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. డిజిటల్ క్లాసులు లేవని, బాత్రూమ్ సమస్యలు వేధిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సవారి, మన్సూర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి..

ధరూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పారుచర్ల, జీరబండ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. బుధ, శుక్రవారాల్లో విధిగా గుడ్డు అందించాలన్నారు.వంట గదులు, సామగ్రి నిల్వ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో నర్సింహులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ఎర్రవల్లి: మండల పరిధిలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుడు వడ్ల మహేష్ (పాఠశాల పూర్వ విద్యార్థి)ను ఘనంగా సన్మానించారు. మండలంలోని కారుపాకుల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వడ్ల మహేష్ 5 నుంచి 10వ తరగతి వరకు జెడ్పీహెచ్ఎస్ ధర్మవరంలోనే చదివి ఇటీవల ఉపాధ్యాయుడి కొలువు సాధించాడు. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పూలమాల వేసి శాలువాలతో ఘనంగా సత్కరించి పలువురు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల - బి. ఐస్వరాజు - 9666283739
అలంపూర్/అయిజ - ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్
9951602829
జబ్బర్ లాల్ : 9553955603